# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, బుధవారం 24 ఏప్రిల్ 2024 SIDDIPET




గజ్వేల్‌లో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

# శోభాయమానం

- భగవంతుడి కృపతో అందరికీ మంచి జరగాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



సిద్దిపేటలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట/గజ్వేల్, ఏప్రిల్ 23: జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో సిద్దిపేట, గజ్వేల్ పట్టణాలు మార్మోగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్, శ్రీరాముడి విగ్రహాలతో మంగళవారం ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ యాత్ర మహిళల మంగళహారతులతో చిన్నారులు, యువకుల కేరింతల మధ్య ఆద్యాంతం ఉత్సాహంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, తాగునీరు, అన్నదానం చేశారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**అందరికీ మంచి జరగాలి: హరీశ్‌రావు**

దేవుడి దయతో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌లో నిర్వహించిన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ యాత్రలో హనుమాన్, రాముడి విగ్రహాలకు పూలమాల వేసి, ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేటలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో మాలధారులతో కలిసి భిక్షలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, భజరంగదళ్ కార్యకర్తలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సిద్దిపేటలో హనుమాన్ మాలధారులతో కలిసి భిక్ష చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



మంగళ వారం రాత్రి సిద్దిపేటలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంటర్వ్యూను టీవీలో వీక్షిస్తున్న ప్రజలు



# రియల్ ధమాల్

## రియల్ రంగంలో నెలకొన్న స్తబ్ధత.. ధరల్లేక తగ్గిన క్రయవిక్రయాలు

- క్రయవిక్రయాలకు ఆసక్తి చూపని రియల్టర్లు
- వ్యవసాయ భూముల కొనుగోళ్లు తగ్గుముఖం
- భూముల కొనుగోళ్లపై రియల్ వ్యాపారులు, రైతుల అనాసక్తి
- కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణం: రియల్ వ్యాపారులు

### రియల్ వ్యాపారం కుప్పకూలింది



ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. భూములు కొనడానికి ఎవరూ ముందుకొస్తలేరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు రియల్ ఎస్టేట్ జోరుగా సాగింది. అప్పుడు రోజుకు 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు జరిగేవి. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రోజుకు 5 కూడా అవడంలేదు. గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట జాతర ఉండేది, నేడు జనాలు కరువయ్యారు. ఇంత దారుణంగా పడిపోవడం నేనెప్పుడూ చూడలేదు.

*– సామ్యానాయక్, రియల్ వ్యాపారి, నర్సాపూర్*

సంగారెడ్డి/ మెదక్ (నమస్తే తెలంగాణ)/ గజ్వేల్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రియల్ ఎస్టేట్ రంగానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో అధికార మార్పిడి తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించింది. ప్రస్తుతం రియల్ రంగంలో స్తబ్ధత నెలకొన్నది. దీంతో కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన వారు లబోదిబోమంటున్నారు. పెట్టుబడి వస్తే చాలు అన్న చందంగా రియల్ వ్యాపారులు ఆలోచిస్తున్నారు. క్రయవిక్రయాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా తగ్గుముఖం పట్టాయి.

**సంగారెడ్డి జిల్లాలో నెలకొన్న స్తబ్ధత**

హైదరాబాద్‌కు సమీపంగా ఉన్న సంగారెడ్డి జిల్లాలో రియల్ వ్యాపారం గత కొన్నేండ్లుగా ఊపందుకుంది. కేసీఆర్ సర్కార్ ధరణి తీసుకురావడం, తహసీల్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండడం, వెంటనే మ్యుటేషన్ ఇవ్వడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగింది. పటాన్‌చెరు, సంగారెడ్డితోపాటు దూరంగా ఉన్న నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లోనూ భూముల క్రయవిక్రయాలు భారీగా జరిగాయి. ఇతర ప్రాంతాలవారు భూములు కొనేందుకు ఆసక్తి చూపడంతో ధరలు అమాంతంగా పెరిగి, రైతులకు లాభాల పంట పండింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ రంగం ధమాల్ అన్నది. రైతులు ఆశించిన స్థాయిలో భూములకు ధరలు రావడంలేదు. దీంతో భూ క్రయవిక్రయాల సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 60,458 వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాలో ప్రతి నెలా సుమారు 5వేల భూముల రిజిస్ట్రేషన్లు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్ల సంఖ్య ప్రతి నెలా 1500 లోపు తగ్గినట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రియల్ రంగానికి శరాఘాతంలా మారుతున్నాయన్న విమర్శలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఫామ్ ల్యాండ్ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్‌లో మంజీరా పరివాహక ప్రాంతాల్లో భూముల కొని ఫామ్ ల్యాండ్ తయారు చేసి అమ్ముతున్నారు. గుంట, రెండు గుంటల భూముల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం నిలిపివేశారు. దీంతో రియల్ వ్యాపారంపై ప్రభావం పడి ఆర్థికంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సిద్దిపేటలో నెమ్మదించిన వ్యాపారం**

సిద్దిపేట జిల్లాలో రియల్ వ్యాపారం ఢమాల్ అన్నది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించింది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి, ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ భూమి ఎకరం రూ.కోటి పెట్టి కొనుగోలు చేసిన దాన్ని రూ.10 నుంచి రూ.20 లక్షలకు తక్కువకైనా విక్రయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆ ధరకు కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. గజ్వేల్ ప్రాంతం నుంచి కేసీఆర్ పోటీకి నిలవడంతో ఒక్కసారిగా ఈ ప్రాంతంలో రియల్ వ్యాపారం పుంజుకుంది. గజ్వేల్ అభివృద్ధిపై కేసీఆర్ వరాల జల్లు కురిపించడంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చి వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేశారు. అప్పట్లో గజ్వేల్ చుట్టుపక్కల ఎక్కడ చూసినా గుంటకు రూ.3 నుంచి రూ.4 లక్షలు పలికిన ధర కొద్ది రోజుల్లోనే ఏకంగా రెట్టింపునకు చేరింది. గజ్వేల్ వైపు రియల్ వ్యాపారులు, కొనుగోలుదారులు భారీగా రావడంతో భూముల ధరలు మరింత పెరిగాయి. నాలా కన్వర్షన్ అనుమతితో ప్లాట్ల అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. వందకు పైగా లేఅవుట్లు ఏర్పాటు కావడంతో రియల్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. గజ్వేల్ ప్రాంతం లో వ్యవసాయ భూమి ఎకరం రూ.40 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు కొనుగోలు, అమ్మకాలు జరిగాయి. ఎక్కువగా ములుగు, వర్గల్, మర్కూక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల్లో రియల్ వ్యాపారం జరిగింది. ఎకరాల నుంచి గుంటల్లో భూముల అమ్మకాలు జరిగాయి.

గజ్వేల్ మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తుండడంతో మర్కూక్, వర్గల్, ములుగు మండలాల్లోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమి ఎకరం రూ.2కోట్ల పైనే పలికింది. బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ప్రస్తుతం ఈ భూమిని రూ.1.50 కోట్లకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్నా, కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. కేసీఆర్ ఉంటే ధైర్యంగా భూములు కొన్న హైదరాబాద్‌కు చెందిన రియల్టర్లు, ఇప్పుడు అసలే ముందుకు రావడం లేదు.

**ప్రభుత్వం మారడంతో...**

జగదేవ్‌పూర్ సమీపంలో ఎనిమిదేండ్ల క్రితం సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ అనుమతితో లేఅవుట్ చేయగా, అప్పట్లో హైదరాబాద్‌కు చెందిన ఉద్యోగులు, వ్యాపారులు గజానికి రూ.6 వేలు వెచ్చించి కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి గజానికి రూ.3 వేలకు విక్రయిస్తామని ముందుకొచ్చినా ఎవరూ కొనడం లేదని తెలిపారు.

### నాలుగు నెలల నుంచి వ్యాపారమే లేదు



కొత్త ప్రభుత్వం వస్తే వ్యాపారాలు పెరుగుతాయనుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలా రియల్ భూం పడిపోతుందని ఊహించలేదు. నాలుగు నెలల నుంచి వ్యాపారమే లేదు. గతంలో తీసుకున్న ధరలకు ఇప్పటికి బాగా తేడా ఉంది. దాదాపు 30 శాతం వరకు ధరలు తగ్గిపోయాయి. ఇప్పుడు ఏం చేయాలో తోచడం లేదు.

*– బొద్దుల సాగర్, రియల్ వ్యాపారి, రామాయంపేట*

**పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు**

మెదక్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడకేసింది. భూముల క్రయవిక్రయాలు భారీగా తగ్గిపోయాయి. లేఅవుట్లలో ప్లాట్లు అమ్ముకోవడానికి వ్యాపారులు నానాపాట్లు పడుతున్నారు. కొంతమంది అప్పులకు వడ్డీలు కట్టలేక తక్కువ రేటుకు స్థలాలు అమ్ముకుంటున్నారు. ఏడాది క్రితం వరకు గ్రామీణ ప్రాంతాల్లోనూ భూముల కొనుగోలు, అమ్మకందార్లు, మధ్యవర్తుల హడావిడితో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉండేది. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న భూములు, ప్రధాన రహదారికి దూరంగా ఉన్న భూములు కూడా కొనుగోలు చేసి వెంచర్లు వేసేవారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద క్రయవిక్రయదారులతో సందడిగా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా మందగించింది. నాలుగైదు నెలల క్రితం మెదక్ ప్రాంతంలో విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రోజుకు 20 వరకు రిజిస్ట్రేషన్లు ఉండగా, ప్రస్తుతం 5కు మించడంలేదు. ఇవి కూడా కుటుంబ సభ్యుల మధ్య పంపకాలు, గిఫ్ట్ డీడ్‌లే.

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



జోగిపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బట్టలు ఇస్త్రీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

- మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కింది
- ఫ్రీ ప్రయాణం అని బస్సులు తగ్గించారు
- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్
- ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు
- మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్
- అందోల్ - జోగిపేటలో ఇంటింటా ప్రచారం

అందోల్, ఏప్రిల్ 23: మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అందోల్- జోగిపేట మున్సిపల్‌లో వ్యాపారస్తులు, ప్రజలను కలుస్తూ ప్రచారం చేశారు. పట్టణంలోని పోచమ్మ, జోగినాథ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమయ్యాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ప్రకటన చేసి బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గించారన్నారు. దీంతో మహిళలు బస్సుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 4 నెలల్లోనే పాలన అస్తవ్యస్తంగా మారిందని, సీఎం రేవంత్ ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. మళ్లీ కేసీఆర్ పాలన కావాలంటున్నారన్నారు. స్థానికంగా ప్రచారం చేస్తూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ఎంపీపీ బాలయ్య, జడ్పీటీసీ రమేశ్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నాగభూషణం, వీరభద్రరావు, మహేశ్‌యాదవ్, బీర్ల శంకర్, ఖాజాపాషా, ఖలీల్ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని పార్టీ కాంగ్రెస్

## జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



బొడ్మట్‌పల్లిలో మహిళతో మాట్లాడుతున్న గాలి అనిల్ కుమార్

టేక్మాల్, ఏప్రిల్ 23: హామీలు నెరవేర్చని పార్టీ కాంగ్రెస్ అని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఆయనతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాశ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

**రేగోడ్‌లో రోడ్ షో**

రేగోడ్, ఏప్రిల్ 23: రేగోడ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రోడ్ షోలో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నాయకుడు జైపాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా..



డాక్టర్ శ్రీశైలం

ఝరాసంగం, ఏప్రిల్ 23: సామాన్య కుటుంబంలో పుట్టి సాగుపై మక్కువతో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఝరాసంగం మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీశైలం ప్రతిభ చాటారు. అగ్రికల్చర్ సైంటిస్ట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ) నిర్వహించిన జాతీయ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల నియామక పరీక్షల ఫలితాల్లో (ఏఎస్ఆర్‌బీ) వ్యవసాయ శాస్త్రవేత్తగా ఆయన ఉద్యోగం సాధించారు. నాన్‌లోకల్ విభాగంలో ఆయనకు అరుణాచల్‌ప్రదేశ్ కేడర్‌ను కేటాయిస్తూ ఏఎస్ఆర్‌బీ సోమవారం ఫలితాలు ప్రకటించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన శ్రీశైలం విద్యాభ్యాసం జడ్పీహెచ్ఎస్ ఝరాసంగం, ఇంటర్మీడియట్ డీఆర్‌డీవో ద్వారా నారాయణ కళాశాల, గ్రాడ్యుయేషన్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ బనారస్ హిందూ యూనివర్సిటీ, పీహెచ్‌డీ తిరుపతిలోని వేంకటేశ్వర యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ... ఈ విజయం వెనుక తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఉపాధ్యాయులు, మిత్రుల సహకారం ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా రైతులకు మేలు చేసేలా తన పరిశోధనలు కొనసాగిస్తానన్నారు. డాక్టర్ శ్రీశైలంకు గ్రామస్తులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# సంగారెడ్డిలో 3 నామినేషన్లు




రఘునందన్‌రావు తరఫున నామినేషన్ వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో జహీరాబాద్ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్, ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి బాబు దుర్గయ్య రోమల, అలియెన్స్ ఆఫ్ డెమొక్రెటిక్ రీఫార్మ్స్ పార్టీ నుంచి మణి చావగాని నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర వివరాలను నోటీస్ బోర్డుపై ఉంచనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్ సైట్‌లోనూ అప్‌లోడ్ చేస్తామన్నారు.

**మెదక్‌లో 10 నామినేషన్లు దాఖలు**

మెదక్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తరఫున రెండో సెట్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నర్సాపూర్ నాయకుడు మురళీధర్‌యాదవ్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా తుపాకుల మురళీకాంత్, కె.సత్యనారాయణగౌడ్, కొల్కూరి ప్రతాప్, చిక్కుపల్లి నవీన్, మాడి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్లు వేశారు. ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా కె.బంగారయ్య, ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరి, ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి మైసన్గారి సునీల్, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ నుంచి దొడ్ల వెంకటేశం నామినేషన్లు దాఖలు చేశారు.

# నేటి నుంచి బడులకు వేసవి సెలవులు



రామాయంపేట: ప్రోగ్రెస్ కార్డులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం
- నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం
- ప్రైవేటు విద్యాలయాలు తెరిస్తే కేసులు : విద్యాశాఖ అధికారులు



నిజాంపేట ప్రభుత్వ పాఠశాల నుంచి బైబై చెబుతూ వెళ్తున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ/ రామాయంపేట, ఏప్రిల్ 23: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు (1 నుంచి 9వ తరగతి వరకు) బుధవారం నుంచి వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. చివరి రోజు మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 965 ప్రభుత్వ బడులు, 80 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు.

# సీఎం సభను విజయవంతం చేయాలి

- 26న పెద్దశంకరంపేటలో బహిరంగసభ
- మంత్రి దామోదర రాజనర్సింహ
- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



పెద్దశంకరంపేటలో స్థల పరిశీలన చేస్తున్న మంత్రి దామోదర, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23: సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ నెల 26న మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో నిర్వహించే సీఎం ఎన్నికల ప్రచార సభాస్థలి ఏర్పాట్లను జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కలిసి మంగళవారం పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, సభను విజయవతం చేసేలా ఏర్పాట్లు చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలను భారీగా తరలించాలన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళికా సంఘం మాజీ అధ్యక్షుడు నగేశ్ షెట్కార్, పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధుసూదన్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఆర్ఎన్ సంతోష్, రాజేందర్‌గౌడ్, సత్యనారాయణ, దేవేందర్, పెరుమాల్‌గౌడ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్ఫూర్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న సివిల్ ర్యాంకర్ బుద్ధి అఖిల్

# పట్టుదల ఉంటే ఏదైనా సుసాధ్యమే

- సివిల్స్ 321వ ర్యాంకర్ బుద్ధి అఖిల్

కొండపాక (కుకునూరుపల్లి), ఏప్రిల్ 23: సాధించాలనే పట్టుదల ఉంటే ప్రతి విద్యార్థికి అసాధ్యమైంది ఏమీ ఉండదని సివిల్స్ 321వ ర్యాంకర్ బుద్ధి అఖిల్ అన్నారు. కొండపాకకు చెందిన ఆయన మంగళవారం కొండపాకలోని జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బి.విఠల్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి లక్ష్యం వైపు పయనించాలన్నారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ ఎంత పెద్ద అడ్డంకులైనా ఎదుర్కోవాలన్నారు. అనంతరం స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థులకు పట్టాలు ప్రదానోత్సవం చేశారు.